సాక్షి ములుగు

శుక్రవారం । 22 । నవంబర్ । 2024



సాగు భూములకు పట్టాలివ్వాలి

దశాబ్దాలుగా ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వాలని ఐటీడీఏ పెసా సమన్వయకర్త కొమురం ప్రభాకర్ అన్నారు. - 9లో



బీసీ రిజర్వేషన్ల వర్గీకరణతోనే న్యాయం - 8లో

రిజర్వేషన్లలో వర్గీకరణ అమలుతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని బీసీ, కుల, వృత్తి సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం 28.0°/16.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణంగా ఉంటుంది. రాత్రి సమయంలో చలి తీవ్రత ఎక్కువగా పెరుగుతుంది.

పీటీసీలో గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ కావ్య, పీటీసీ ప్రిన్సిపాల్ పూజ, పరేడ్‌లో మహిళా ట్రైనీ కానిస్టేబుళ్లు, సీటీసీలో గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా, పోలీస్ డ్రెస్‌లో కూతురిని చూసి ఆనందభాష్పాలు రాలుస్తున్న తల్లిదండ్రులు, తల్లికి తన టోపీ ధరిస్తున్న కుమారుడు







భావోద్వేగం.. వెల్లివిరిసిన ఆనందం

పీటీసీ, సీటీసీలో అట్టహాసంగా పాసింగ్ అవుట్ పరేడ్

- తరలివచ్చిన కుటుంబ సభ్యులు..
- ప్రజల రక్షణే పోలీస్ లక్ష్యమన్న మంత్రి సీతక్క

మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల, మడికొండలోని సీటీసీలో గురువారం పోలీస్ పాసింగ్ అవుట్ పరేడ్‌లు అట్టహాసంగా జరిగాయి. 9నెలల ట్రైనింగ్‌కు ట్రైనీ కానిస్టేబుళ్లు దీక్షాంత్ పరేడ్‌తో వీడ్కోలు పలికారు. శిక్షణలో నేర్చుకున్న కొన్ని ప్రధాన అంశాలను అభ్యర్థులు ప్రదర్శించి చూపరులను ఆకట్టుకున్నారు. శిక్షణను ముగించుకుని విధులలో చేరనున్న తమ బిడ్డలను చూసేందుకు ఉమ్మడి పది జిల్లాల నుంచి తల్లిదండ్రులు వచ్చారు. వారి పిల్లల పరేడ్, విన్యాసాలు చూస్తూ ఆనందంలో మునిగిపోయారు. పరేడ్ అయిపోగానే ఆత్మీయ ఆలింగనం చేసుకుని సంతోషంగా గడిపారు. పీటీసీలో జరిగిన కార్యక్రమానికి మంత్రి సీతక్క, ఎంపీ కావ్య హాజరుకాగా, సీటీసీలో సీపీ అంబర్ కిషోర్ ఝా పాల్గొన్నారు.

- మామునూరు/మడికొండ

- వివరాలు 8లో

న్యూస్‌రీల్

రామప్ప ఆలయాన్ని సందర్శించిన కేంద్రమంత్రి



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని కేంద్ర ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిబాయి బంబానియా సందర్శించారు. ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్.. ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి పూజలు నిర్వహించగా పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ వెంకటేశ్ వివరించగా.. రామప్ప ఆలయ శిల్పాకళాసంపద బాగుందని కేంద్ర సహాయ మంత్రి కొనియాడారు. కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టీఎస్, ములుగు ఆర్డీఓ వెంకటేశ్, డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన పనులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని క్రాస్‌రోడ్డు వద్ద అభయాంజనేయస్వామి 35 ఫీట్ల విగ్రహ ప్రతిష్ఠాపన పనులు వేగంగా సాగుతున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు అన్నారు. గ్రామ ప్రజలు సురక్షితంగా ఉండేందుకు విగ్రహ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్‌రావు, గడదాసు సునీల్, తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, గండెపల్లి నర్సయ్య, మాదరి రాంబాబు, కాశ్ల రామకృష్ణ, దేవక శ్రీరామ్, రాంనర్సయ్య పాల్గొన్నారు.

బొలెరో వాహనం ఢీ.. పశువుల మృతి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై బొలెరో వాహనం ఢీకొని నాలుగు పశువులు మృతి చెందాయి. ఈ ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని నర్సింగాపూర్ నుంచి ఏటూరునాగారం వైపు హైవే నుంచి కామారం వెళ్లేదారి సమీపంలో మేతకు వెళ్లి వస్తున్న పశువులను బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కల్లెబోయిన ధనలక్ష్మి, రేగుల స్వరూప, పాయిరాల నర్సయ్య, పిట్టల అజయ్‌లకు చెందిన నలుగురి పశువులు మృతి చెందగా మరో పశువు తీవ్రంగా గాయపడింది. పశువులను తొలుకుని వస్తున్న భరత్ కూడా వాహనం తగిలి గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు.

నాటువైద్యంతో ప్రాణాపాయం



ములుగు రూరల్: ప్రజలు ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నాటువైద్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకోకూడదని నిమ్స్ వైద్య బృందం సభ్యుడు గంగాధర్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల పరిధిలోని జంగాలపల్లిలో మూడు రోజులుగా రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చేపడుతున్న వైద్య శిబిరాన్ని బృందం వైద్యులు పరిశీలించారు. ఈ శిబిరంలో వైద్య సిబ్బంది అందించిన వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఒళ్లు నొప్పుల పేరుతో ప్రతిరోజూ పెయిన్ కిల్లర్ మాత్రలు వాడకూడదన్నారు. మూడు రోజులుగా గ్రామంలో వైద్య శిబిరంలో జ్వర పీడితుల నుంచి సేకరించిన రక్త నమూనాల రికార్డును పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని టీ హబ్ కేంద్రాన్ని, రేడియాలజీ కేంద్రాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య బృందం సభ్యులు స్వర్ణలత, సిరాజ్, విష్ణు, హరికృష్ణ, జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీకాంత్, పీహెచ్‌సీ వైద్యుడు ప్రసాద్ పాల్గొన్నారు.

'ఓపీఎస్'లపై చిన్నచూపు

నెలల తరబడి వేతనాలు విడుదల చేయని ప్రభుత్వం

- ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కార్యదర్శులు
- వేతనాలు కోసం ఎదురుచూస్తున్న వైనం



రాజుపేటలో అధికారులతో కలిసి ఇంటింటి సర్వే చేస్తున్న ఓపీఎస్ కార్యదర్శి(ఫైల్)

మంగపేట: జిల్లాలో అవుట్ సోర్సింగ్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల(ఓపీఎస్) పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుంది. గత కొన్ని నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో విధుల నిర్వహిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 9మండలాల పరిధిలో 174 గ్రామ పంచాయతీలు ఉండగా 21మంది అవుట్ సోర్సింగ్ పద్ధతిలో గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నెల వేతనం ఒక్కొక్కరికి రూ.17,700 ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా జీఎస్టీ, పీఎఫ్, ఈఎస్ఐ, కాంట్రాక్టర్ కమీషన్ ఇతర కటింగులు పోనూ నెల రోజులకు చేతికి వచ్చే రూ.12,500 వేతనంతో జీవనం కొనసాగిస్తున్నారు. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా ప్రభుత్వం మాత్రం వీరి సేవలకు అరకొర వేతనాలే చెల్లిస్తుంది. అవి కూడా ప్రతినెలా చెల్లించని పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఇచ్చే వేతనం ఇంటి అద్దె, కుటుంబ పోషణకు ఎటూ సరిపోక అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

అన్ని రంగాల్లో పనిచేసే వారిందరికి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ఓపీఎస్‌లకు మాత్రం ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం చెల్లించడం లేదు. గ్రామ పంచాయతీలలో పనిచేసే మల్టీపర్పస్ కార్మికులు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులకు వేతనాల్లో కొద్దిపాటి తేడా మాత్రమే ఉండటం గమనార్హం. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం వరకు పంచాయతీ కార్యదర్శులు విధుల్లో ఉంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించే ప్రతీ కార్యక్రమంలో భాగస్వాములు కావాల్సి ఉంటుంది. రోజువారీగా చేపట్టే పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, పంచాయతీల నిర్వహణ, సమస్యల పరిష్కారం, హరితహారం మొక్కల పరిరక్షణ, డ్రైడే యాక్టివిటీలతో పాటు ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ, ఎన్నికల సమయంలో ఓటర్ల జాబితా తయారీ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ప్రత్యక్షంగా కీలక పాత్ర పోషించే ఓపీఎస్‌లకు కొంతమందికి 5నెలలు, మరికొంతమందికి 9నెలల వేతనాలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన వేతనాలు చెల్లించాలని ఓపీఎస్‌లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



చుంచుపల్లిలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి రాజేష్(ఫైల్)

రెండు, మూడు రోజుల్లో చెల్లిస్తాం..

జిల్లాలో పనిచేస్తున్న ఓపీఎస్‌లకు రెండు, మూడు రోజుల్లో బకాయి వేతనాలు చెల్లిస్తాం. ప్రభుత్వం నుంచి రూ.11లక్షల గ్రాంట్ వచ్చింది. వెంటనే వేతనాలు చెల్లించే విధంగా 9 మండలాల ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేశాం.

- దేవరాజ్, జిల్లా పంచాయతీ అధికారి

పెండింగ్‌లో వేతనాలు



జిల్లాలోని ఓపీఎస్‌లకు గరిష్ఠంగా 5నుంచి 9నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో వేతనాలు సకాలంలో రాక తమ కుటుంబాలు గడవక ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులను అడిగితే ప్రభుత్వం గ్రాంట్ విడుదల చేయడం లేదని చెబుతున్న పరిస్థితి ఉంది. జిల్లాల్లో ఒక్కో కార్యదర్శికి నెలకు రూ.17,700 చొప్పున 5నెలలకు గాను మొత్తం రూ.90 వేల చొప్పున 21మందికి రూ.18.90 లక్షల వేతనాలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఐదు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో ఉద్యోగులు కుటుంబ ఆర్థిక అవసరాలు, ఇంటి అద్దెతో పాటు తదితర ఖర్చులకు డబ్బులు లేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఇదిలా ఉండగా పంచాయతీలకు ప్రభుత్వం అరకొర నిధులు కేటాయిస్తూ మరికొన్ని పంచాయతీలకు నిధులు కేటాయించకపోవడంతో ఆయా పంచాయతీల నిర్వహణకు మరిన్ని అప్పులు చేయాల్సి వస్తుందని ఓపీఎస్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ ఎంట్రీ బాధ్యతతో చేపట్టాలి



సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

కలెక్టర్ టీఎస్.దివాకర

ములుగు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్యుమరేటర్లు సేకరించిన ఇంటింటి కుటుంబ సర్వే ఆన్‌లైన్ ఎంట్రీని బాధ్యతతో చేపట్టాలని కలెక్టర్ టీఎస్.దివాకర సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో చేపట్టిన ఆన్‌లైన్ ప్రక్రియను కలెక్టర్ గురువారం దివాకర ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి తప్పులు లేకుండా సేకరించిన డేటాను ఉన్నది ఉన్నట్లుగా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఆపరేటర్లకు తగిన సూచనలు, సలహాలు చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్ఐ యుగేంధర్‌రెడ్డి, ఎంపీఓ రహీం, ఈడీఎం దేవేందర్ ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అంబేడ్కర్ విగ్రహానికి పెయింటింగ్ వేయించాలి

ములుగు: రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు ప్రత్యేక నిధులు కేటాయించి పెయింటింగ్ వేయించాలని దళిత సంఘాల నాయకులు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జన్ను రవి, మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి చుంచు రవి, అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ సమితి జిల్లా చైర్మన్ నెమలి నర్సయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు రమేష్, అనిల్, దేవేందర్ పాల్గొన్నారు.

గ్రామస్తులకు చిక్కిన దొంగ

- చితకబాది పోలీసులకు అప్పగింత



దొంగను స్తంభానికి కట్టేసిన గ్రామస్తులు

ఏటూరు నాగారం: మండల కేంద్రంలో వరుస దొంగతనాలతో హడలెత్తిస్తున్న ఓ దొంగ గ్రామస్తులకు గురువారం చిక్కాడు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని రామన్నగూడెం ప్రధాన రోడ్డు వెంట మద్యం బెల్ట్‌షాపులు ఉన్నాయి. ఆ షాపుల్లో ఇప్పటికీ మూడు మార్లు దొంగతనాలు జరిగాయి. ఇదే అదునుగా భావించిన ఆ దొంగ గురువారం తెల్లవారుజామున బెల్ట్‌షాపులోకి చొరబడడంతో ఆ షాపు యజమాని పసిగట్టి వాడిని గ్రామస్తుల సహకారంతో పట్టుకున్నాడు. దొంగను స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ దొంగతనం కేసులో ఈ దొంగతో పాటు మరో ముగ్గురు గ్రామస్తులు కూడా ఉన్నారని తెలిపారు. ఈ వివరాల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలి

ములుగు: ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకోవాలని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సాదు రఘు కోరారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్య కార్మికుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయకులు హాజరై జిల్లా కేంద్రంలో జెండా ఆవిష్కరించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్ల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మత్స్య సంపదపై కేవలం ముదిరాజ్‌లకు మాత్రమే చట్టపరమైన హక్కులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 50 సంవత్సరాలు దాటిన మత్స్యకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. చేపపిల్లల పంపిణీలో మధ్య దళారుల ప్రమేయం లేకుండా చూడాలన్నారు. 2017 నుంచి ఇప్పటి వరకు మృతి చెందిన 23మంది కుటుంబాలకు ఇన్సూరెన్స్ చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు శానబోయిన వెంకటమల్లయ్య, పిట్టల వెంకటస్వామిరాజు, వెంకటేశ్వర్లు, సురేశ్, భరత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలి



ఏటూరునాగారంలో జెండా ఎగురవేస్తున్న రఘు

ఏటూరునాగారం: మత్స్యకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీ కల్పించి ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధిలోకి తీసుకురావాలని ముదిరాజ్ మహాసభ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఏటూరునాగారం మండల మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆ సంఘం జెండాను రఘు గురువారం ఎగురవేసి మాట్లాడారు. ఏజెన్సీ మత్స్యకారుల హక్కులకు పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మహాసభ జిల్లా నాయకులు భాస పుల్లయ్య, కులపెద్దలు నకిరబోయిన రమేష్, చింతకింది రాజు, గాడిచర్ల సాంబయ్య, పల్లబోయిన మొగిళి, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు వదిలించేనా?



జోరుగా గంజాయి దందా

- యువతే టార్గెట్‌గా బిజినెస్
- విచ్చలవిడిగా విక్రయాలు
- రెండు కమిషనరేట్లు, నాలుగు జిల్లాలకు కేంద్రంగా నగరం
- డబ్ల్యూఎన్‌పీఎస్ ఏర్పాటుతో భరోసా..

నవంబర్ 8న వరంగల్ రైల్వే స్టేషన్ పరిధిలో 48 కిలోల గంజాయిని జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్‌ఫాం-2, 3 వైపు ప్లాస్టిక్ సంచులు, బుట్టలతో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని తనిఖీ చేయగా.. గుట్టురట్టయ్యింది. ఒడిశాలోని గంజాం జిల్లా తలపాడు గ్రామానికి చెందిన బాబిత కుమారి పాణిగ్రహి గుజరాత్‌లోని సూరత్‌కు తరలిస్తుండగా.. గంజాయి లభ్యమైంది.

- 'పుష్ప' సినిమా తరహాలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కొందరు ఒడిశాలోని నా టుగురులో 338 కిలోల గంజాయి కొని 96 ప్యాకెట్లుగా మార్చి ట్రాక్టర్ ట్రాలీ కింద భద్రపర్చి వరంగల్ నుంచి కామారెడ్డికి సెప్టెంబర్ 21న తరలిస్తుండగా.. హసన్‌పర్తి మండలం అనంతసాగర్ వద్ద యాంటీ డ్రగ్స్ పోలీసులు పట్టుకున్నారు.
- సెప్టెంబర్ 28న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రెవెన్యూ ఉద్యోగి మరిపెడ నుంచి హైదరాబాద్‌కు కారులో గంజాయి తరలిస్తూ గాలివారిగూడెం సమీపంలో పోలీసులకు పట్టుబడ్డాడు. అందులో రూ.31.75 లక్షల విలువైన 127 కిలోల ఎండు గంజాయి లభించింది.
- ఆగస్టు 28న సుబేదారి పోలీసులు హనుమకొండ అంబేడ్కర్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మంగపేట మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు రూ.23 వేల విలువైన 880 గ్రాముల గంజాయితో పట్టుబడ్డారు.
- వరంగల్ జిల్లా ఖానాపూర్, చెన్నారావుపేటకు చెందిన ముగ్గురు యువకులు హనుమకొండలోని పెగడపల్లి డబ్బాల సమీపంలో గంజాయి సేవిస్తూ ఇటీవల కేయూసీ పోలీసులకు పట్టుబడ్డారు.

పట్టుబడిన గంజాయి, కేసులు, విలువ

యూనిట్	కేసుల సంఖ్య	డిస్‌పోస్డ్ డ్రగ్ (కిలోల్లో)	విలువ (రూ.కోట్లలో)
వరంగల్	21	1,245.439	3.07
మహబూబాబాద్	24	515	1.29
జేఎస్ భూపాలపల్లి	25	636.39	1.59
ఖమ్మం	48	853.577	1.96
భద్రాద్రి కొత్తగూడెం	271	32,069.181	80.17
మొత్తం	389	35319.587	88.08

సాక్షిప్రతినిధి, వరంగల్ :

హైదరాబాద్ తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్‌ను తమ వ్యాపారానికి కేంద్రంగా మార్చుకున్నారు గంజాయి విక్రయదారులు. కొత్త పంథాలో, సరికొత్త ఎత్తుగడలతో గంజాయిని తరలిస్తూ, విక్రయిస్తున్నారు. పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలతో చెక్ పెడుతున్నప్పటికీ.. మూడు దమ్ములు.. ఆరు కిక్కులు అన్నట్లుగా ఉమ్మడి జిల్లాలో గంజాయి విక్రయాలు కొనసాగుతున్నాయి. ఈజీ మనీ కోసం కొందరు ముఠాగా ఏర్పడి ఈ దందా సాగిస్తున్నారు. విశాఖపట్నం, ఒడిశా నుంచి వరంగల్ మీదుగా మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌కు తరలిస్తున్న ముఠా.. నగరంలోనూ ఏజెంట్లను ఏర్పరుచుకుని గంజాయి విక్రయిస్తోంది. కాగా.. సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్ (డబ్ల్యూఎన్‌పీఎస్)ను మంగళవారం ప్రారంభించారు. ఈనేపథ్యంలో వరంగల్‌ను డ్రగ్స్ ఫ్రీ కేంద్రంగా మార్చేందుకు మరింత సీరియస్‌గా చర్యలు చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.

స్కూల్ స్థాయి నుంచే..

యువతతో పాటు కొందరు స్కూల్ స్థాయి నుంచే గంజాయి వినియోగిస్తున్నారు. రాత్రి సమయంలో కాజీపేట, వరంగల్ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలు, వరంగల్, హనుమకొండ బస్‌స్టేషన్ ఆవరణలు, వరంగల్‌లోని ఉర్సు గుట్ట, చిన్నవడ్డేపల్లి చెరువు, రంగశాయిపేట బెస్తం చెరువు, ఖిలావరంగల్ గుండు చెరువు, రాతికోట, ఎనుమాముల మార్కెట్ శివారు, కాకతీయ కెనాల్ ప్రాంతాలు, హనుమకొండలోని బంధం చెరువు, న్యూశాయంపేట రైల్వే ట్రాక్, ఔటర్ రింగ్ రోడ్డు, పలివేల్పుల, వడ్డేపల్లి చెరువు కట్ట, హాస్టళ్లు, అద్దె రూములను అడ్డాగా చేసుకొని విద్యార్థులు బృందాలుగా ఏర్పడి గంజాయి తాగుతున్నారు. ఇటీవల అమ్మాయిలు సైతం గంజాయికి అలవాటు పడుతున్నట్లు తెలిసింది.

కట్టడి చేసేందుకు డబ్ల్యూఎన్‌పీఎస్..

డ్రగ్స్‌ను కంట్రోల్ చేసేందుకు వరంగల్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్ (డబ్ల్యూఎన్‌పీఎస్)ను ఏర్పాటు చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌తో పాటు మహబూబాబాద్, జేఎస్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఇక్కడే హెడ్‌క్వార్టర్‌గా డీఎస్పీ నేతృత్వంలో పోలీసు బృందాలు పని చేస్తున్నాయి. ఇప్పటి వరకు రూ.88 కోట్ల విలువైన 35,319 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 389 కేసులు నమోదు చేసినట్లు అధికారులు డబ్ల్యూఎన్‌పీఎస్ ప్రారంభం సందర్భంగా ప్రకటించారు.

రవాణా మార్గాలివే..

గంజాయిని ప్రధానంగా ఏడు మార్గాల ద్వారా వయా వరంగల్, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. చిత్రకొండ, సీలేరు, డోర్నకల్, మోతుగూడెం, చింతూరు, భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం నుంచి వరంగల్ ఒక మార్గం, చిత్రకొండ, సీలేరు, డోర్నకల్, మోతుగూడెం, లక్నవరం ఎక్స్ రోడ్, రాజమండ్రి మరోమార్గం. కలిమెల, కుంట (ఛత్తీస్‌గఢ్), చెట్టి (చింతూరు), భద్రాచలం మరోమార్గం. భద్రాచలం, వెంకటాపురం, ములుగు, పస్రా, తాడ్వాయి, వరంగల్, హైదరాబాద్‌కు పెద్ద ఎత్తున గంజాయి తరలుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఐదో రూటు రాజమండ్రి, అశ్వారావుపేట, కల్లూరు, తల్లాడ, ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ కాగా.. పాడేరు, జి మాడ్గుల, చోడవరం, అనకాపల్లి, రాజమండ్రి, విజయవాడ, కోదాడ, సూర్యాపేట, హైదరాబాద్‌కు గంజాయి తరలుతోంది. అలాగే చింతపల్లి, లంబసింగి, నర్సీపట్నం, కోటనందూరు, తుని, జగ్గంపేట, రామచంద్రాపురం, చింతూరు, గుండాల, భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లెందు, జనగామ, హైదరాబాద్‌కు వెళ్తుండగా..ఇదేదారిలో జనగామ నుంచి వరంగల్‌కు చేరుతుంది. అరకు, ఎస్.కోట, దేవరపల్లి, పెందుర్తి, అనకాపల్లి, రాజమండ్రి, విజయవాడ, కోదాడ నుంచి వరంగల్, హైదరాబాద్‌కు.. వరంగల్ నుంచి మహారాష్ట్ర వివిధ మార్గాల ద్వారా గంజాయి రవాణా అవుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

టూల్స్‌పై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మల్లేశం

ములుగు: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) టూల్స్‌పై విద్యార్థులు తప్పనిసరి అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం సూచించారు. ఈ మేరకు కళాశాలలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. గ్రంథాలయ, సమాచార శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సంబంధిత అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం డాక్టర్ జగదీశ్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)విప్లవాత్మక శక్తిగా మారిందని తెలిపారు. ఏఐ టూల్స్‌తో పరిశోధనలు సులభం అవుతాయని తెలిపారు.

ఆనంద క్షణాలు..









మామునూరు పీటీసీలో కుటుంబ సభ్యులతో ఆనందం పంచుకుంటున్న మహిళా కానిస్టేబుళ్లు



సీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న చైతన్య కుమార్‌ను ముద్దాడుతున్న తల్లి



సీటీసీలో శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుల్ శేఖర్‌గౌడ్‌ను ముద్దాడుతున్న కూతురు, కొడుకు



కమాండర్ జె.ప్రన్యుషకు షీల్డ్ అందజేస్తున్న మంత్రి సీతక్క, ఎంపీ కావ్య

ప్రజల ప్రాణరక్షణే పోలీస్ లక్ష్యం..



ఒత్తిళ్లకు తలొగ్గకుండా సేవలందించాలి

- శాఖ ప్రతిష్టతకు ప్రభుత్వం పెద్దపీట
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, ఎంపీ కడియం కావ్య
- మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో దీక్షాంత్ పరేడ్

మామునూరు: 'పోలీస్ ఉద్యోగమంటే మాటలు కాదు.. వృత్తిపరంగా అనేక ఒత్తిళ్లుంటాయి.. ఏమాత్రం తలొగ్గొద్దు.. వాటిని ధైర్యంగా స్వీకరించి బాధితులకు న్యాయం జరిగేలా సేవలు అందించాలి' అని రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి ధనసరి సీతక్క పిలుపునిచ్చారు. ప్రజల ప్రాణ రక్షణే పోలీస్ లక్ష్యమని, ఇందు కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున కానిస్టేబుళ్ల నియామకం చేపట్టి శాంతిభద్రతల పటిష్టానికి పెద్దపీట వేసిందని పేర్కొన్నారు. ఈమేరకు గురువారం ఖిలా వరంగల్ మండలం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ (ఎస్పీ) ఆధ్వర్యంలో ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 1127 మంది సివిల్, ఏఆర్ మహిళా కానిస్టేబుళ్ల దీక్షాంత్(పాసింగ్ అవుట్) పరేడ్ కార్యక్రమం కన్నుల పండువగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మంత్రి ధనసరి సీతక్క, వరంగల్ ఎంపీ కడియం కావ్య హాజరై ప్రిన్సిపాల్ ఇంజారపు పూజతో కలిసి మహిళాకానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళా కానిస్టేబుళ్లను ఎంపిక చేసి పక్కన పెట్టిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పోలీస్ వ్యవస్థ పటిష్టతను మరింత పెంచేలా సీఎం రేవంత్‌రెడ్డి ఎంపికైన కానిస్టేబుళ్లకు 9 నెలల శిక్షణ ఇప్పించారని గుర్తు చేశారు. పురుషులకు దీటుగా అధిక శాతం మహిళలు పోలీసు విభాగాన్ని ఎన్నుకోవడం శుభపరిణామమని తెలిపారు.

ప్రతిభావంతులకు అవార్డులు

పాసింగ్ పరేడ్‌లో భాగంగా శిక్షణలో ప్రతిభ కనబరిచిన శిక్షణార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. బెస్ట్ ఆల్‌రౌండర్ ఏఆర్ నిర్మల్‌కు చెందిన కొయేడి మోనాలిక, బెస్ట్ ఇండోర్ సివిల్ ఆల్ రౌండర్ రాచకొండకు చెందిన మెట్టు మాధవి, బెస్ట్ ఇండోర్ ఏఆర్ ఆదిలాబాద్‌కు చెందిన సి.లావణ్య, బెస్ట్ ఔట్‌డోర్ సివిల్ వనపర్తికి చెందిన ఎస్.స్వాతి, బెస్ట్ ఔట్ డోర్ ఏఆర్ హైదరాబాద్‌కు చెందిన కాట్రగడ్డ కీర్తి రాణించగా..వారికి ప్రశంస పత్రం, మెమొంటోలు అందజేశారు.



మాట్లాడుతున్న రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, చిత్రంలో ఎంపీ కావ్య

జీవిత ప్రగతి సాధించాలి..

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ జీవిత ప్రగతి సాధించాలని, పోలీస్ వ్యవస్థను పటిష్టపరిచి సామాన్యులకు న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని సమాజంలో జరిగే సైబర్ నేరాలపై నిత్యం అప్రమత్తంగా ఉండి, వాటిని నియంత్రించే దిశగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు రమేశ్, రవీందర్, వెంకటేశ్వర్‌రావు, పాండునాయక్, భిక్షపతి, ఆర్‌ఐలు చంద్రశేఖర్, విజయ్, కాశీరాం, నవీన్, మహేశ్, సీఎల్‌ఐలు రవీందర్, నవీన్, సుధాకర్, ఆర్ఎస్సైలు దశరథం, సుధాకర్, రాజేశ్, అనిల్, లక్ష్మపతి, రాధిక, సమ్మిరెడ్డి, వడ్డె నరేశ్, దీపక్, ఏఓ కల్పనారెడ్డి, డాక్టర్ సుధీర్, పీఆర్ఓ రామాచారి, వ్యాఖ్యత మగ్దూం, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ విన్యాసాలు అదుర్స్

మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో జరిగిన 9నెలల ట్రైనింగ్‌కు దీక్షాంత్ పరేడ్‌తో వీడ్కోలు పలికారు. ఉదయం 8.30 నుంచి 11.30 గంటలకు వరకు పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. శిక్షణలో నేర్చుకున్న కొన్ని ప్రధాన అంశాలను కానిస్టేబుళ్ల ప్రదర్శించి చూపరులను ఆకట్టుకున్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

పోలీస్ కీర్తి ప్రతిష్టలు పెంపొందించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

మడికొండ: పోలీస్ కీర్తి ప్రతిష్టలు పెంపొందించేలా ప్రజలకు సేవ చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా పిలుపునిచ్చారు. కాజీపేట మండలం మడికొండ శివారులోని సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో 9 నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 246 మంది స్టైఫండరీ ట్రైనీ పోలీసు కానిస్టేబుళ్ల (సివిల్) పాసింగ్ అవుట్ పరేడ్ (దీక్షాంత్ పరేడ్) గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీటీసీ ప్రిన్సిపాల్ ఎస్. రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ అంబర్‌కిశోర్ ఝా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందు ట్రైనింగ్ కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ సమాజంలో ప్రత్యేక్షంగా సేవలందించేది పోలీసులు మాత్రమేనన్నారు. శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన కర్తవ్యమన్నారు. ప్రలోభాలకు లొంగకుండా నీతి, నిజాయతీతో విధులు నిర్వహించే పోలీసులకు సమాజంలో గౌరవం పెరగడంతో పాటు, అధికారుల గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, శ్రీనివాస్, సీటీసీ వైస్ ప్రిన్సిపాల్ రమణబాబు, ఏసీపీలు తిరుమల్, సురేంద్ర, అనంతయ్య, ఆర్ఐ ఉదయభాస్కర్, శ్రీనివాస్, శ్రీధర్, స్పర్జన్‌రాజ్, ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, మంగీలాల్, కిషన్, ఎస్సై రాజబాబు, తదితరులు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ కష్టాలు చూసి ఉద్యోగం సాధించా..



మాది హైదరాబాద్. పేదరికంతో జీవనం సాగిస్తున్నాం. అమ్మనాన్న కష్టాలు చూసి ఎలాగైనా ప్రభుత్వం ఉద్యోగం సాధించాలని లక్ష్యం విధించుకున్న. కష్టపడి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. శాఖ పరంగా బాధితులకు న్యాయం జరిగేలా పని చేస్తా. **- అర్చన, హైదరాబాద్**

ఆనందంగా ఉంది..



మాది సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెం. నాకు పెళ్లయ్యింది. ఇద్దరు పిల్లలు. డిగ్రీ, డీఈడీ పూర్తి చేశా. ఎస్సై ఉద్యోగం సాధించాలన్నది నా కోరిక. అది కొద్దిలో మిస్సయ్యింది. ఇప్పుడు సివిల్ కానిస్టేబుల్ వచ్చింది. తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకుని బయటికి వెళ్తున్నందుకు సంతోషంగా ఉంది. **- ఎన్.భవాని**

ఉత్తమ సేవలందించడమే లక్ష్యం



మాది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం. అమ్మానాన్నల ప్రోత్సాహంతోనే సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించా. విధి నిర్వహణలో పారదర్శకతతో పనిచేసి ప్రజలకు ఉత్తమ సేవలందించడమే నా లక్ష్యం. **- బి.పావని, భద్రాద్రికొత్తగూడెం**

శిక్షణార్థులు నా బిడ్డలే..



ప్రతి ఒక్కరిని నా కన్న బిడ్డల్లా చూసుకుంటూ కంటికి రెప్పలా కాపాడుకున్న. ఇక్కడ నేర్చుకున్నా ప్రతీ అంశాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేసి నేరాలను తగ్గించాలి. ప్రజల రక్షణ కోసం ప్రతి కానిస్టేబుల్ ముందు నడిచేలా తీర్చిదిద్దాం. **-ఇంజారపు పూజ, ప్రిన్సిపాల్, పీటీసీ మామునూరు**

నాన్నను ఆదర్శంగా తీసుకున్న



మాది వనపర్తి జిల్లా. నేను బీటెక్ పూర్తి చేశా. మా నాన్న నిరంజన్ పోలీసు డిపార్టుమెంట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మానాన్నను ఆదర్శంగా తీసుకుని మొదటి సారి ఎస్సై ఉద్యోగానికి ప్రిపేర్ కాగా ఒక్క మార్కు తేడాతో చేజారింది. మరో ప్రయత్నంలో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించినందుకు ఆనందంగా ఉంది. **- ఎం.చైతన్యకుమార్, వనపర్తి**

స్కూల్ బస్సు కింద పడి బాలుడి మృతి



కొడకండ్ల: ప్రైవేట్ స్కూల్ బస్సుకింద పడి గిరిజన బాలుడు మృతి చెందిన సంఘటన గురువారం జనగామ జిల్లా కొడకండ్ల మండలం చెరువుముందుతండా శివారు రతిరాం తండలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రతిరాంతండాకు చెందిన వాంకుడోత్ రమేష్–పరమేశ్వరి దంపతులకు కుమార్తె, కుమారుడున్నాడు. కుమార్తె శాన్విక దేవరుప్పులలోని ప్రైవేట్ పాఠశాలలో నర్సరీ చదువుతూ నిత్యం స్కూల్ బస్సులో వెళ్లి వస్తున్నది. తల్లి పరమేశ్వరి కుమార్తె శాన్వికను గురువారం ఉదయం స్కూల్ బస్సు ఎక్కించింది. ఆ సమయంలో వెంట వెళ్లిన కుమారుడు శ్రీహన్(2) బస్సు ముందున్నాడు. డ్రైవర్ గమనించకుండా ముందుకు నడిపించడంతో శ్రీహన్ టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆఖరి 'ఆట' ముగిసింది..

- ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొన్న బైక్..
- ఇద్దరు యువకుల దుర్మరణం
- అయ్యగారిపల్లిలో ఘటన



కుమారస్వామి(ఫైల్)



విశాల్(ఫైల్)

కురవి: ఇద్దరు స్నేహితులు.. వేర్వేరు సినిమా టాకీస్‌ల్లో పనిచేస్తున్నారు.. సెకండ్ షో ముగించుకున్న అనంతరం బైక్‌పై ఇంటికి వస్తున్నారు.. ఈ క్రమంలో ఆగి ఉన్న టిప్పర్ ఢీకొని దుర్మరణం చెందారు. ఈ ప్రమాదం వారి జీవితపు ఆఖరి ఆటకు ముగింపు పలికింది.. ఎస్సై గండ్రాతి సతీశ్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదనపల్లికి చెందిన వల్లపు కుమారస్వామి(19), వెంపటి విశాల్(20) స్నేహితులు. కుమారస్వామి మహబూబాబాద్‌లోని సూర్య టాకీస్, విశాల్ ముకుంద్ థియేటర్లలో పనిచేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి సెకండ్ షో ముగిసిన తర్వాత ఇద్దరు ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ నుంచి కురవి మీదుగా సూదనపల్లికి వస్తున్నారు. చలితీవ్రతకు తట్టుకోలేక తమ వద్ద ఉన్న చద్దరు తలమీదినుంచి కప్పుకుని వస్తున్నారు. ఈ క్రమంలో అయ్యగారిపల్లి శివారులో మోరి వద్ద 365 జాతీయ రహదారిపై కోదాడకు చెందిన ఆగి ఉన్న టిప్పర్‌ను బైక్ గురువారం తెల్లవారుజామున ఢీకొంది. చద్దరు కళ్ల మీదకు వచ్చిందో లేదో తెలియదు గాని ఒక్కసారిగా ఎదురుగా ఉన్న టిప్పర్‌ను ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న ఎస్సై గండ్రాతి సతీశ్ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాలను మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై వెంపటి విశాల్ తండ్రి బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. కాగా, ఇద్దరు యువకులు మృతి చెందడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. అశ్రు నయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. సూదనపల్లి గ్రామం శోకసంద్రంలో మునిగింది.

బీసీ రిజర్వేషన్ల వర్గీకరణతోనే న్యాయం

- అన్ని వర్గాలకు అవకాశాలు వచ్చేలా రిజర్వేషన్లు ఖరారు చేయాలని వినతి
- స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల గుర్తింపుపై కమిషన్ విచారణ



మాట్లాడుతున్న డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రావు

హన్మకొండ: వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లలో వర్గీకరణ అమలుతోనే అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని బీసీ సంఘాలు, కుల, వృత్తి సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. ఇప్పటి వరకు చాలా బీసీ వర్గాలకు రాజకీయ అవకాశాలు రాలేదని, బీసీ ఏ, బీ, సీ, డీ వర్గీకరణ వారీగా రిజర్వేషన్ల ఖరారు చేయాల్సిన అవసరముందని ఆయా వర్గాలు కమిషన్‌కు వివరించాయి. గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల గుర్తింపు కోసం డెడికేటెడ్ బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో జరిగిన ఈ బహిరంగ విచారణలో కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్ రావు, కార్యదర్శి సైదులు అభిప్రాయాలు తెలుసుకున్నారు. వినతి పత్రాలు స్వీకరించారు. హనుమకొండ, వరంగల్, జనగామ, ములుగు, జేఎస్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన బీసీ సంఘాలు, కుల, వృత్తి సంఘాల ప్రతినిధులు వచ్చి తమ అభిప్రాయాలు కమిషన్‌కు వివరించారు.

- తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్లపై బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ తిరునహరి శేషు సవివరంగా వివరించారు. తెలంగాణలోనూ బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.
- బీసీ పొలిటికల్ జేఏసీ హనుమకొండ జిల్లా చైర్మన్ సుందర్ రాజు యాదవ్ మాట్లాడుతూ గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ ఉండగా 23 శాతానికి తగ్గిందని, ప్రస్తుం 42 శాతానికే పరిమితం చేస్తే మరో పోరాటం చేయాల్సి వస్తుందన్నారు.
- సంచార జాతుల సంఘం ప్రతినిధి పల్లపు సమ్మయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో సంచార జాతుల వారు 12 నుంచి 15 శాతం వరకు ఉన్నారన్నారు. తమకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు.
- ఫకీర్ కులం ప్రతినిధి మహమ్మద్ మహబూబ్ అలీ మాట్లాడుతూ తమకు ఇప్పటి వరకు ఎలాంటి రాజకీయ అవకాశాలు రాలేదన్నారు. రాజకీయ అవకాశాలు కల్పించాలని కోరారు.
- బీసీ రాజ్యాధికార సమితి ప్రతినిధి రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు.
- పద్మశాలి సంఘం ప్రతినిధులు చందా మలయ్య, వడ్నాల నరేందర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు.
- అఖిల గాండ్ల కుల సంఘం ప్రతినిధి అన్నపూర్ణ మాట్లాడుతూ తమ సామాజిక వర్గానికి రాజకీయ అవకాశాలు రావడం లేదని, తమకు ఆ అవకాశాలు వచ్చేలా రిజర్వేషన్లు ఉండాలన్నారు.
- మైనారిటీతో పాటు ఆయా కుల, వృత్తి సంఘాల వారు మాట్లాడుతూ తమ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు.

నివేదికను ప్రభుత్వానికి అందిస్తాం..

బీసీ సంఘాలప్రతినిధుల నుంచి స్వీకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందిస్తామని డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్ రావు అన్నారు. విచారణ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుపై మాత్రమే మాట్లాడాలని చైర్మన్ వెంకటేశ్వర్ రావు పదేపదే చెప్పినా బీసీ సంఘాల ప్రతినిధులు మాత్రం తమ సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. వివిధ కుల సంఘాల నుంచి డెడికేటెడ్ బీసీ కమిషన్‌కు 105 వినతులు అందాయని అధికారులు తెలిపారు. హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ డీడీలు రమేశ్, జి.రాంరెడ్డి,వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లాల బీసీ సంక్షేమ శాఖ అధికారులు పుష్పలత, నర్సింహాస్వామి, రవీందర్ రెడ్డి, శైలజ, రవీందర్ పాల్గొన్నారు.

ఎస్సార్‌లో యంత్ర-24 ప్రాజెక్ట్ ఎక్స్‌పో



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో యంత్ర-24 ప్రాజెక్ట్ ఎక్స్‌పోను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి అల్ట్రాటిక్ సిమెంట్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) టెక్నాలీజీ వివిధ ఇంజనీరింగ్ టెక్నాలజీల్లో ఎలా ఉపయోగపడుతోందో ఉదాహరణలతో వివరించారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పోలతో విద్యార్థుల్లోని సృజనాత్మకను వెలికి తీసి నూతన టెక్నాలజీలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఎస్సార్ యూనివర్సిటీ వీసీ డాక్టర్లక్ష్మీదీపక్‌గార్గ్ మాట్లాడుతూ.. ఈకార్యక్రమంతో పారిశ్రామిక నిపుణుల అభిప్రాయాలు తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో నిపుణులు వివిధ విభాగాల ప్రాజెక్టులను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి, డీన్ డాక్టర్ ఏవీవీ సుధాకర్, డాక్టర్ రవిచందర్, డాక్టర్ మహేశ్‌తోపాటు వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

రైల్వే ఆర్ఆర్‌బీ ఎగ్జామ్స్ స్పెషల్ ట్రైన్స్

- కాజీపేట మీదుగా 10 స్పెషల్ సర్వీసులు

కాజీపేట రూరల్: ఈ నెలలో జరిగే ఆర్ఆర్‌బీ ఎగ్జామ్ రాసే అభ్యర్థుల కోసం కాజీపేట జంక్షన్ మీదుగా స్పెషల్ ట్రైన్స్ నడిపిస్తున్నట్లు గురువారం రైల్వే అధికారులు తెలిపారు. ఉమ్మడి జిల్లా ఆర్ఆర్‌బీ అభ్యర్థులు ఈ సర్వీసులను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

స్పెషల్ ట్రైన్స్ వివరాలు..

డిసెంబర్ 24, 25, 26, 28, 29వ తేదీల్లో గుంటూరు– సికింద్రాబాద్– గుంటూరు (07101/07102) వెళ్లే ట్రైన్ కాజీపేట జంక్షన్‌కు 14:15/15:45 గంటలకు చేరుకుంటుంది. ఈరైళ్లకు మంగళగిరి, విజయవాడ, మధిర, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, కేసముద్రం, వరంగల్, కాజీపేట, జనగామ, ఆలేరు, భువనగిరి, చర్లపల్లి, మౌలాలి రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ సౌకర్యం కల్పించారు.

మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌పై భూఆక్రమణ కేసు

- హనుమకొండ సుబేదారి పీఎస్‌లో బాధితుల ఫిర్యాదు
- ఆయనతోపాటు మరికొందరిపై నమోదు

వరంగల్ క్రైం: మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్, అతడి అనుచరులపై భూ ఆక్రమణ, దొంగతనం కింద సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి గురువారం తెలిపారు. ప్రశాంత్‌నగర్‌కు చెందిన రుద్రోజు పద్మావతి అలియాస్ జల్లిపల్లి పద్మావతి హంటర్‌రోడ్డులోని వినాయకనగర్ రోడ్డు నంబర్ -1 లో గల దుర్గాదేవి కాలనీలో 500 గజాల భూమిని మాజీ ఎమ్మెల్యే, అతని అనుచరుల అక్రమించారని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. 1985లో పద్మావతి తండ్రి మారం వీరయ్య ఆమెకు పసుపు, కుంకుమల కింద ఈ భూమిని ఇచ్చి 2009లో రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఫిర్యాదులో తెలిపారు. దీంతో పాటు 2023లో గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఇంటి నిర్మాణం కోసం అనుమతి పొంది అ స్థలంలో కంటెయినర్ ఇల్లు నిర్మాణం చేసుకోగా కంటెయినర్‌తోపాటు అందులోని రూ.3 లక్షల విలువైన వస్తువులను శంకర్‌నాయక్‌తో పాటు అతని అనుచరులు దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు. కంటెయినర్‌ను ఎతుకుపోవడంపై బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ అనుచరులపై గత ఏడాది కేసు నమోదు అయ్యిందని వివరించారు. ఇటీవల శంకర్‌నాయక్ అనుచరులు అజ్మీరా వెంకటనాయక్, బానోత్ ప్రేమ్‌నాయక్, బానోత్ మోహన్‌లాల్‌తోపాటు మరో ముగ్గురు వ్యక్తులు బాధితురాలితోపాటు భర్త, కుమారుడిపై దాడి చేసి సెల్‌ఫోన్లను లాక్కున్నట్లు వివరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు శంకర్‌నాయక్, అతడి అనుచరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

లాకర్ కోసిన దొంగకు గాయం?

- గ్యాస్ కట్టర్‌తో కట్ చేసే సమయంలో చేతికి గాయం
- సమీప ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్నాడనే అనుమానం
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, మెడికల్ షాపుల్లో తనిఖీలు
- అన్ని బ్యాంక్‌లను అప్రమత్తం చేస్తున్న పోలీసులు

సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో భారీ బంగారం చోరీ కేసు విచారణను పోలీసులు అన్ని కోణాల్లో వేగం పెంచినా అనుకున్నంత పురోగతి కనిపించడం లేదు. సెక్యూరిటీ గది తలుపులు పగులగొట్టి మూడు సేఫ్ లాకర్లలో ఒకటైన బంగారు ఆభరణాలు ఉన్న లాకర్‌ను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసే క్రమంలో అంతర్జాతీయ ముఠా సభ్యుల్లో ఒకరి చేతి కాలినట్టుగా పోలీసులకు ఘటనాస్థలిలో ఆనవాళ్లు లభ్యమయ్యాయని తెలిసింది. ఈ మేరకు రాయపర్తి మండలంతోపాటు కొద్ది దూరంలో ఉన్న వర్ధన్నపేట, తొర్రూరు పట్టణాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో, మెడికల్ షాపుల్లో గురువారం తనిఖీలు చేశారు. గాయపడిన దొంగ ఎక్కడైనా చికిత్స పొందాడా, లేదా మందులు తీసుకున్నాడా అనే వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇంకోవైపు ఈ కేసు విచారణ కోసం ఏర్పాటుచేసిన నాలుగు ప్రత్యేక బృందాలు ఇప్పటికే ఇదే తరహా దొంగతనం జరిగిన ఠాణాల అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. తమిళనాడుతోపాటు కర్ణాటకలోనూ దొంగల కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. 497 మంది ఖాతాదారులకు చెందిన 19 కిలోల బంగారం కావడంతో ఈ నేరస్తులను పట్టుకోవడం కోసం పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. ఇప్పటికే రాయపర్తి పోలీసుల నైట్ పెట్రోలింగ్ చేయకపోవడంతో పాటు బ్యాంక్ వద్ద సెక్యూరిటీ గార్డు లేకపోవడంపై ఇప్పటికే ప్రజల నుంచి విమర్శలొస్తున్నాయి.



వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న పోలీసులు

అలర్ట్...అలర్ట్..

రాయపర్తిలోని ఎస్‌బీఐలో భారీ చోరీ జరిగిన నేపథ్యంలో వరంగల్ కమిషనరేట్ పోలీసులు అప్రమత్తమయ్యారు. తమ పరిధుల్లో ఉండే బ్యాంక్‌లను సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. ప్రతి బ్యాంక్ వద్ద సెక్యూరిటీ గార్డును నియమించుకోవాలని సూచించారు. సీసీటీవీ కెమెరాలు, లాక్ సిస్టం, అలారం వంటి అంశాలతో తనిఖీ చేస్తూ సూచనలు చేశారు. అన్ని బ్యాంక్‌ల వారు తమ ప్రధాన కార్యాలయానికి ఇక్కడి సీసీటీవీ కెమెరాలను అనుసంధానించడం ద్వారా ఇక్కడ ఏమీ జరిగినా తెలిసిపోయేలా ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు.